

'గాలికుంటు' దరి చేరకుండా..

పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు పశు వైద్యాధికారులు టీకాలు వేస్తున్నారు. వచ్చే నెల 14వరకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారు. 8లో▸



ఆధార్ తరహాలో అపార్

విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపుకార్డుల జారీకి కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. తల్లిదండ్రుల సమ్మతితో వివరాలు సేకరించి కార్డులు జారీ చేస్తారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కేజీబీవీ ఉద్యోగులకు నియామక పత్రాలు


పత్రాలు అందజేస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీల్లో పోస్టుల భర్తీకిగాను స్థానిక డీఈవో కార్యాలయంలో సోమవారం డీఈవో యాదయ్య నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 14 పోస్టులు భర్తీ చేశారు. ఇందులో స్పెషల్ ఆఫీసర్ 1, సీఆర్‌టీలు 7, పీజీసీఆర్‌టీలు 6 ఖాళీల్లో అభ్యర్థులను నియమించారు. 2023 జూలైలో నిర్వహించిన పరీక్షలో మిగిలిన అభ్యర్థులను మెరిట్, రోస్టర్ ప్రకారం 1:3 పద్ధతిన ఎంపిక చేసి ఈ ఏడాది సెప్టెంబర్ 25న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో 1:1 ప్రాతిపదికన ఎంపిక చేసి ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి పద్మజ, సీనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకం


బంగారు పతకంతో పప్పు నారాయణ

రామకృష్ణాపూర్: తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్, జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్ సికింద్రాబాద్‌లో నిర్వహించిన 9వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో గద్దెరాగడికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పప్పు నారాయణ 60 ఏళ్ల పైబడిన విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. 400 మీటర్ల ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో ప్రతిభకనబరిచి బంగారు పతకం గెలుచుకున్నాడు. బటర్‌ఫ్లై 50 మీటర్లలో ప్రథమ స్థానంలో నిలిచి బోపాల్‌లో వచ్చే నెల 10న జరిగే మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి


వస్త్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పాతమంచిర్యాల: వస్త్రాల వ్యాపారులు, షాపింగ్‌మాల్ యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ(ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల) అధికారి కే.విజయసారథి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఎమ్మార్, చెన్నయ్‌సిల్క్స్, వైభవం షాపింగ్‌మాల్‌లో తనిఖీలు నిర్వహించారు. రెడీమేడ్ వస్త్రాలు, కిడ్స్‌వేర్, చీరలు, లుంగీలు అన్ని రకాల కంపెనీల వస్త్రాలను పరిశీలించారు. తయారీ సంస్థలు, ధరలు, ప్యాకింగ్ తేదీలు లేని వాటిని గుర్తించి పది కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కే.విశ్వేశ్వర్, పెద్దపల్లి సహాయ లీగల్ మెట్రాలజీ అధికారి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయం'


జయశ్రీని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు


మంచిర్యాలటౌన్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వాన్ని చేపట్టాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకటకృష్ణ, గాదె శ్రీనివాస్, తుల ఆంజనేయులు, అక్కల రమేష్, జోగుల శ్రీదేవి, మాధవరపు వెంకటరమణరావు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి' గేట్ల ఎత్తివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతోంది. 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎస్సారెస్పీ నుంచి 38 వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 7,100 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 333 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా.. 8 గేట్లు ఎత్తి 45వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వదులుతున్నారు.

బడిబయట టీచర్లపై ఆరా..!

- ఏళ్ల తరబడి బోధనేతర విధుల్లోనే..
- వివరాల సేకరణలో విద్యాశాఖ తలమునకలు




PROCEEDINGS OF THE DIRECTOR, SCHOOL EDUCATION, TELANGANA, HYDERABAD

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల్లో పాఠాలు బోధించకుండా బోధనేతర కార్యక్రమాలకే పరిమితమైన టీచర్లపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఏళ్ల తరబడి డిప్యూటేషన్ పేరిట ఆయా విధుల్లో మునిగి తేలుతున్న వారిపై ఆరా తీసింది. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో సమన్వయకర్తలు, టాస్, ఇతర విధుల్లో దీర్ఘకాలిక డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వారి వివరాలు సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డీఈవోలను ఆదేశించింది. ఏఎస్‌వో, డీసీఈబీలో అసిస్టెంట్ సెక్రెటరీ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఆర్సీలో పనిచేస్తున్న టీచర్ల ఎంతమంది ఉన్నారు..? ఏన్నాళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నారనే సమాచారం సేకరణలో నిమగ్నమైంది.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉద్యోగులు, సిబ్బంది కొరతతో విద్యాశాఖ కార్యాలయంలో ఆయా విభాగాల్లో టీచర్లను సర్దుబాటు చేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు కాలపరిమితి ముగిసినా ఏళ్ల తరబడి కార్యాలయాల విధుల్లోనే పాతుకుపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్జీటీ ఫారిన్ సర్వీస్‌లో కొనసాగుతున్నాడు. నిబంధనల ప్రకారం మూడేళ్ల తర్వాత పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. ఇటీవల ప్రమోషన్ వచ్చినా తిరస్కరించడం.. పాఠశాలకు వెళ్లకుండా అదే పోస్టులో కొనసాగడంపై ఉపాధ్యాయ సంఘాలు తప్పు పడుతున్నాయి. జిల్లా సైన్స్ కార్యక్రమాల నిర్వహణకు ప్రధానోపాధ్యాయుడు, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ టీచర్‌ను జిల్లా సైన్స్ అధికారిగా నియమిస్తారు. ఇందులో భాగంగా నూతన జిల్లా ఏర్పడినప్పటినుంచి ఓ సైన్స్ టీచర్‌కు డీఎస్‌వోగా విధులు కేటాయించారు. సైన్స్ కార్యక్రమాలు నిర్వహించిన సమయంలో మినహా మిగతా సమయమంతా పాఠశాలలో పాఠాలు బోధించాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతమైన ఓ పాఠశాలలో విధులు నిర్వర్తించే ఫిజికల్ సైన్స్ టీచర్‌ను డీఎస్‌వో పనిచేసే పాఠశాలకు సర్దుబాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మరో పాఠశాల నుంచి టీచర్‌ను ఎందుకు కేటాయించారో అధికారులకే తెలియాలి. డీఎస్‌వో బాధ్యతల నుంచి తప్పుకుంటూ ఏడాది క్రితం తన పాఠశాలకు వెళ్లేందుకు సముఖత వ్యక్తం చేసినా రిలీవ్ చేయకపోవడంపై అప్పట్లో చర్చనీయాంశమైంది. డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) సెక్రెటరీగా జిల్లా కేంద్రమైన గర్మిళ్ల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సమ్మెటివ్ పరీక్షలు(ఎస్‌ఏ) ప్రశ్నపత్రాల తయారీ పర్యవేక్షణ అంతా ఆయన చూడాల్సి ఉంటుంది. పరీక్షల సమయంలో తప్పె మిగతా సమయంలో పాఠశాల విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కార్యాలయం ఓచోట.. పాఠశాల మరో చోట ఉండడమో ఏమోగానీ రెండు చోట్ల సరైన సమయంలో అందుబాటులో లేకపోతున్నట్లు తెలుస్తోంది. డీసీఈబీ సెక్రెటరీకి సహాయకుడిగా చెన్నూర్ జెడ్పీహెచ్ఎస్ పోక్కుర్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌కు బాధ్యతలు కేటాయించారు. ప్రస్తుత సహాయకుడిగా విధులు నిర్వహించే టీచర్ దూరంగా ఉండడమో ..? ఏమోగానీ పాఠశాలకు వెళ్లి పాఠాలు చెప్పిన దాఖలాలు తక్కువే. ఇక్కడ కూడా మరో టీచర్‌ను డిప్యూటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా పరీక్షల విభాగంలో మాత్రం అవసరమైనప్పుడు మాత్రమే ఓ టీచర్‌ను కేటాయిస్తుండగా మిగిలిన టీచర్ల విషయంలో ఉదాసీనత ఎందుకో అధికారులకే తెలియాలి.

బోధనకు ఆటంకం కలుగకుండా

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కులగణన సర్వేలో విద్యార్థుల చదువులు నష్టపోకుండా, బోధనకు ఆటంకం కలుగకూడదనే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చింది. జిల్లాలో మాత్రం బడుల్లో వేతనం పొందుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం పేరిట పాఠాలు బోధించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. ఇదివరకు డీఈవో కార్యాలయంలో సెక్టోరల్ అధికారులుగా ఫారిన్ సర్వీసులో విధులు నిర్వర్తించే వారంతా గడువు ముగియగానే వెనక్కి వెళ్లగా మరికొందరు టీచర్లు అదే పోస్టులో తిష్ట వేయడంపై చర్చ సాగుతోంది. ఇలాంటి టీచర్లు ఎంత మంది ఉన్నారు..? ఏమేర చర్యలుంటాయో వేచి చూడాలి.

నిబంధనల మేరకు విధులు..

జిల్లా విద్యాశాఖ కార్యాలయ పరిధిలో విధులు నిర్వర్తించే టీచర్లంతా ఉన్నతాధికారుల ఆదేశానుసారం కొనసాగుతున్నారు. పాఠశాల విద్య ప్రాంతీయ డైరెక్టర్ నుంచి అనధికారికంగా ఇతర విధులు(బోధనేతర) నిర్వర్తించే టీచర్ల వివరాలు సమర్పించాలని ఆదేశాలు వచ్చింది వాస్తవమే. నిబంధనలు విరుద్ధంగా టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు.

– డీఈవో యాదయ్య

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి పునరావాస కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలు, పఠన సామగ్రి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, రూం టు రీడ్ తెలంగాణ రాష్ట్ర మేనేజర్ నరసింహాచారి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈవో తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

మండల భవిత కేంద్రం ప్రారంభం

పడ్తనపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఏర్పాటు చేసిన మండల భవిత కేంద్రాన్ని డీఈవో యాదయ్య, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ప్రారంభించారు. ప్రతీ సోమవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తారని, మండలంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీస్ అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలి


నివాళులు అర్పిస్తున్న సీపీ శ్రీనివాసులు




బెటాలియన్‌లో నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు, సిబ్బంది

- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం
- పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్, పోలీసు కమిషనర్ శ్రీనివాసులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశం కోసం పోరాడి ప్రాణాలు వదిలిన వారి త్యాగాలను కొనియాడారు. పోలీసుల లేని సమాజాన్ని ఊహించలేమని, శాంతిభద్రతల పరిరక్షణలో సంఘ విద్రోహక శక్తులకు వ్యతిరేకంగా పోరాడి తమ ప్రాణాలను పణంగా పెడతారని అన్నారు. అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

త్యాగాలు మరువలేనివి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సమాజంలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి స్ఫూర్తితో విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమాండెంట్ వెంకటరాములు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో 66వ పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల స్తూపం ఎదుట పోలీస్ అమరవీరులకు బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది పిల్లలు 10వ, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్‌లలో ఉన్నతంగా రాణించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోశ్‌సింగ్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, శిక్షణ కానిస్టేబుళ్లు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో అందిన సమస్యల అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 21 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. భూ సమస్యలు, రుణమాఫీ కాలేదని పలువురు దరఖాస్తులు అందజేశారు. 1998లో తన భర్త ఠాకూర్ జగదీశ్వర్‌సింగ్ నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యారని, నక్సలైట్ల బాధిత కుటుంబం కింద ఆర్థిక సహాయం అందించాలని నెన్నెలకు చెందిన ఠాకూర్ రాజేశ్వర్‌బాయి కోరింది. క్యాతనపల్లి మున్సిపాల్టీ ఐదో వార్డులో గత ఏడాది డీఎంఎఫ్‌టీ నిధులు రూ.59లక్షలు మంజూరయ్యాయని, ఇంకా అభివృద్ధి పనులు చేపట్టలేదని, వెంటనే ప్రారంభించేలా చూడాలని కౌన్సిలర్ జిలకర మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలు అందించాలి..



మేము కోటపల్లి మండలం పంగిడి సోమరం గ్రామానికి చెందిన ఆదివాసీ కొలవార్ తెగకు చెందిన రైతులం. మాకు గత ప్రభుత్వ హయాంలో పోడు భూములకు పట్టాలు, పాస్‌బుక్‌లు అందించారు. బ్యాంకుకు వెళ్తే పంట రుణాలు ఇవ్వడం లేదు. పంట పెట్టుబడికి రుణాలు ఇచ్చేలా చూడాలి. – పంగిడి సోమారం రైతులు

ఖాళీ స్థలం కేటాయించాలి



వెనుకబడిన తరగతుల నిరుపేదలమైన మేము గత కొంతకాలంగా బెల్లంపల్లి బూదకుర్దు పరిధిలో శిథిలావస్థలో ఉన్న సింగరేణి క్వార్టర్స్‌లో ఉంటున్నాం. సింగరేణి కంపెనీ క్వార్టర్స్ కూల్చి వేసి ఆ స్థలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. మాకు ఖాళీ స్థలం కేటాయించాలి.

– బూదకుర్దు గ్రామస్తులు

ఇసుక రీచ్‌లు కేటాయించాలి



భీమారం: మండలంలోని ప్రజల అవసరాలకు ఉపయోగించేందుకు చెన్నూరు గోదావరి ఇసుక రీచ్‌లను కేటాయించాలని ట్రాక్టర్ల యజమానులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భీమారంలో గొల్లవాగు పాజెక్ట్ వాగు ఉన్నా అటవీ ప్రాంతంగుండా ప్రవహిస్తుండడంతో అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. చెన్నూరులోని గోదావరినది, సుద్దాల వాగులోని ఇసుక రీచ్‌లను భీమారం మండలానికి చెందిన ట్రాక్టర్లకు ప్రత్యేకంగా కేటాయిస్తే ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలింపుతోపాటో తాము ఉపాధి పొందుతామని కోరారు.

ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు


మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల అధికారులతో ఓటు హక్కు నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులు ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని అన్నారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి ర్యాలీలు, 2కే రన్ కార్యక్రమాలు, దుకాణాల వద్ద అవగాహన కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలతో కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నస్పూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలని తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని నస్పూర్, తీగల్‌పహడ్, సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ ఉపాధ్యాయులను తపస్ నాయకులు సోమవారం కలిశారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అందరూ ఓటు హక్కు నమోదు చే సుకోవాలని సూచించారు. అనంతరం రాబోయే రోజుల్లో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పెండింగ్ డీఏ, పెండింగ్ బిల్లుల మంజూరు, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22 నుంచి ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28న తహసీల్దార్లకు వినతిపత్రాల సమర్పణ, నవంబర్ 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జే.వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మంచి మంచిర్యాల' అక్షరాలు చోరీ


బోసి పోయి కనిపిస్తున్న సెల్ఫీపాయింట్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మున్సిపల్ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ 'మంచి మంచిర్యాల' అక్షరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకెళ్లారు. గతంలో పట్టణ ప్రగతి నిధులు కేటాయించి సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి 'మంచి మంచిర్యాల' అక్షరాలు కనిపించకుండా పోయాయి. దీంతో సెల్ఫీ పాయింట్ బోసిపోయి కనిపిస్తోంది. ఈ విషయమై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను సంప్రదించగా.. అక్షరాలను ఎవరు తీసుకెళ్లారో తెలియదని, సీసీ కెమెరాల్లో పరిశీలించి గుర్తిస్తామని తెలిపారు.

రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, మార్కెటింగ్ అధికారి షాబొద్దీన్‌లతో కలిసి పత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి లబ్ధి పొందాలని తెలిపారు. ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, బ్యాంక్ అనుసంధానం, పత్తి కొనుగోలు కేంద్రాలకు వచ్చే సమయంలో తేమ వంటి నిబంధనలు పాటించాలని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంటు నేషనల్ లెవల్ మానిటర్స్ సభ్యులు సి.వి. బాలమురళి, కే.హెచ్.సునీల్, గణాంక అధికారి సత్యం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీపీవో వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామీణ పాంత్రాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ శివారులో సోమవారం గంజాయి సేవిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో ముచ్చకుర్తి మారుతితో పాటు మరో ముగ్గురు ఉన్నారు. వారిని తనిఖీ చేయగా 83 గ్రాముల గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని నిందితులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓసీపీ బ్లాస్టింగ్ దెబ్బలకు కూలిన ఇల్లు


కూలిన ఇల్లు

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్ దెబ్బలకు దొరగారిపల్లెలో పాలవేని మల్లమ్మకు చెందిన ఇల్లు కూలింది. ఆమె కుమారుడు సురేష్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇంటి వెనుకభాగం కూలింది. ముందుభాగం కూలితే ప్రాణాలు పోయేవని భయాందోళన వ్యక్తం చేశారు. కూలిన ఇంటిని సోమవారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, రక్షణాధికారి సతీశ్ పరిశీలించారు. సివిల్ డిపార్టుమెంట్ అధి కారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సాయిని గంగన్నను ఆటోతో ఢీకొట్టిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆదివారం శాంతినగర్ నుంచి ఠాగూర్ హోటల్ వెళ్తున్న క్రమంలో యూటర్న్ వద్ద ఆటోతో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

బెల్లంపల్లి: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్వో ఎస్.దేవయ్య తెలి పిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మున్సిపాలిటీ మహ్మద్ ఖాసీంబస్తీకి చెందిన చీర్ల హేమ కార్తీక్ (32), చీర్ల శిరీష, అత్త పద్మ గణేశ్ నిమజ్జనం రోజున గొడవ పడ్డారు. దీంతో అతని భార్య ఇద్దరు పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆధార్ తరహాలో అపార్

- విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డుల జారీకి కేంద్రం మార్గదర్శకాలు
- తల్లిదండ్రుల సమ్మతితో ముందుకు..
- విద్యాశాఖ కసరత్తు షురూ

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	పాఠశాలలు, కళాశాలలు	విద్యార్థులు
ఆదిలాబాద్	1,439	1,27,361
కుమురంభీం	1,253	89,301
మంచిర్యాల	1,049	1,02,127
నిర్మల్	1,044	1,14,185



అపార్ కార్డు వివరాలు

నిర్మల్‌ఖిల్లా: 'ఆధార్' తరహాలో విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో 'వన్ నేషన్–వన్ ఐడీ' కార్డును అందుబాటులోకి తేనున్నారు. ప్రక్రియ ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర విద్యా వనరులశాఖ తాజాగా ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కూడా ఇటీవల ఆయా జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలతో కూడిన ఉత్తర్వులిచ్చింది. ఈ అపార్ సంఖ్యనే విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థి అకడమిక్ జర్నీ, విద్యా ప్రయాణం, విజయాలు నిక్షిప్తమై ఉంటాయి. అవసరమైన సమయంలో ట్రాక్ చేయొచ్చని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే తల్లిదండ్రులకు ఐడీ ప్రాముఖ్యతను వివరించి వారి సమ్మతి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలను కోరింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని సూచించింది.

ప్రయోజనం ఏమిటి?

విద్యార్థి కేజీ నుంచి పీజీ వరకు చదివిన, చదువుతున్న సమగ్ర వివరాలు ఒకే గొడుగు కిందకు వస్తాయి. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈ కార్డు ఉపయోగపడనుంది. ఈ కొత్త కార్డును ఆధార్ సంఖ్యతోపాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ)' అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించబడి ఉంటుంది. పాఠశాల విద్యలోని పిల్లలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇచ్చే విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 'చైల్డ్ ఇన్ఫో' పేరిట ఒక్కో విద్యార్థికి, ఒక్కో సంఖ్య విధానాన్ని కొన్నేళ్లుగా అమలు చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ అమలు చేయబోతున్న ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకు దాదాపు 26 కోట్ల మంది విద్యార్థులకు 12 అంకెలున్న సంఖ్యను కేటాయిస్తారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4 వేలకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 200కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 4 లక్షలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ స్థాయిలో చైల్డ్‌ఇన్ఫో, యూడైస్ ప్లస్ ద్వారా ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఐడీ నంబరు కేటాయించబడి ఉంది. కళాశాల స్థాయిలో మరో గుర్తింపుసంఖ్య ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న అపార్ ఐడీ కార్డు ద్వారా మొత్తం ఒకే కార్డులో పూర్తి విద్యాప్రగతి, సమాచారం నిక్షిప్తమై ఉంటుంది.

నిర్వహణ ఇలా...

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరంకు ఈ బాధ్యతను అప్పగించింది. ఆధార్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక సంఖ్యను నమోదుచేస్తే చాలు. విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలు, పొందిన స్కాలర్‌షిప్స్ తదితర వివరాలన్నీ తెలుసుకునే వీలుంటుంది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలోనూ ధ్రువీకరణపత్రాలను భౌతికంగా కాకుండా, డిజిటల్‌లో పరిశీలించి సీటు ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షల దరఖాస్తుల్లోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే సరిపోతుందని ఏఐసీటీఈ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నమోదు ప్రక్రియ

నమోదు ప్రక్రియ వారి తల్లిదండ్రుల సమ్మతితో పాఠశాలచే నిర్వహించబడుతుంది. వారు ఏ సమయంలోనైనా వారి సమ్మతిని ఉపసంహరించుకోవచ్చు. అవసరమైనప్పుడు సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే డేటాను పంచుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పాఠశాలల ద్వారా ప్రతి విద్యార్థిపై సేకరించిన డేటా కేంద్రంగా పనిచేస్తున్న జిల్లా సమాచార పోర్టల్‌లో నిల్వ చేయబడుతుంది. గోప్యత పాటించబడుతుంది.

ప్రయోజనకరం



విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం ఏకీకృతంగా అపార్ కార్డు ద్వారా అందుబాటులోకి రావడం ప్రయోజనకరంగా ఉంటుంది. తల్లిదండ్రుల సమ్మతితోనే చేపట్టాలని మార్గదర్శకాలు ఉన్నాయి. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి సమ్మతితోనే విద్యాశాఖ ముందుకెళ్తుంది.

– డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

సులభతరమవుతుంది



విద్యార్థి తన విద్యాభ్యాస దశలో వివిధ రకాల ప్రాంతాల్లో అభ్యసిస్తాడు. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందికి తేవడం శుభ పరిణామం. కేంద్రం తీసుకొస్తున్న ఈ అపార్ ఐడీ విధానం విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. పదేపదే టీసీలు, బోనఫైడ్, పత్రాలు సేకరించడం వంటి సమస్యలు తీరుతాయి. విద్యార్థి ప్రగతి నైపుణ్యాలు ఒకేచోట నిక్షిప్తం చేయబడతాయి.

– తొడిశెట్టి రవికాంత్, టీయూటీఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సంతోష్

మంచిర్యాలఅర్బన్: కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ హ్యాండ్‌బాల్ పోటీలకు మంచిర్యాలకు చెందిన విద్యార్థి బోసు సంతోష్ ఎంపికయ్యాడు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న సంతోష్ కాకతీయ యూనివర్సిటీ నుచి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యాడు. సదరు విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, క్రీడా విభాగాధిపతి గోపాలకృష్ణ అభినందించారు.

చోరీ కేసుల్లో ముగ్గురికి జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరుగా జరిగిన చోరీ కేసుల్లో ముగ్గురికి జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. టూటౌన్ ఎస్‌హెచ్‌వో మహేందర్ తెలిపిన వివరాల మేరకు 2022 అక్టోబర్‌లో కాల్‌టెక్స్ ఏరియా ఫారెస్టు కాంప్లెక్స్ లోని హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. పూజారి శ్రీరాంభట్ల హరీష్ శర్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి నిందితులు మహ్మద్ బద్రుద్దీన్, సయ్యద్ సికిందర్ అలీని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జె.ముఖేష్ నిందితులకు రెండేళ్ల సాధారణ జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.50 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వైన్‌షాపులో చోరీ కేసులో...

బెల్లంపల్లి చౌడేశ్వరి ప్రాంతంలో ఉన్న హైటెక్ వైన్‌షాపులో గత మార్చిలో చోరీ జరిగింది. గంగాదారి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేయగా చోరీకి పాల్పడిన గుండేటి రాజేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం కేసు విచారణకు రాగా ఆరుగురు సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.50 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జె.ముకేష్ తీర్పు వెల్లడించారు.

కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

- ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆర్కే 5 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ భవిష్యత్తు కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో తామిచ్చిన హామీలను నెరవేర్చబోతున్నామన్నారు. 190 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లను పర్మినెంట్ చేయించామని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా మొదటిసారి లాభాల్లో బోనస్ ఇప్పించడం తమ కృషి ఫలితమేనన్నారు.

యూనియన్‌లో పలువురి చేరిక

నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎంఎస్ సీనియర్ నాయకులు జీవన్ జోయల్, టీబీజీకేఎస్ నాయకులు కందుల శంకర్‌తో పాటు పలువురు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, కలవేన శ్యామ్, జాతీయ సమితి సభ్యుడు భీంరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, లాగల శ్రీనివాస్, పేరం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సింగరేణికి మనుగడ


మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్: కొత్త గనుల ఏర్పాటుతోనే సింగరేణికి మనుగడ ఉందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య అన్నారు. సోమవారం ఎస్సార్పీ 3 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న గనులన్నీ మరో పదేళ్ల వరకు కొనసాగుతాయని, ఆ తర్వాత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కొత్త గనుల ఏర్పాటుకోసం ఏఐటీయూసీ పోరాడుతోందన్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.33 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి కే.కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు తవటం మల్లేశ్, అంబాల రవి, ఆడెపు సురేష్, రామోజీ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆందోళన

- అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లిన ఆదివాసీలు
- అడ్డుకున్న పోలీసులు, స్వల్ప ఉద్రిక్తత


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

కైలాస్‌నగర్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందు కోసం కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆదివాసీలు ఎగ్జిట్ గేట్ నుంచి లోనికి దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. స్వల్ప ఉద్రిక్తత తలెత్తింది. ఆదివాసీలంతా లోనికి రావడంతో కలెక్టర్ రాజర్షి షా వారి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి రుణమాఫీ అమలుతో పాటు కటాఫ్ లేకుండా రైతులందరికీ రైతు భరోసా అందించాలన్నారు. అలాగే క్వింటాల్ పత్తికి రూ.పది వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు గోడం రేణుక, ఉయిక ఇందిర, ఆత్రం గణపతి, మెస్రం కేశవ్, తొడసం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకే జైకొట్టిన ఎస్టీపీపీ కార్మికులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు భూనిర్వాసిత, కాంట్రాక్టు కార్మికులకు అర్హతకు తగిన వేతనాలు, ఇతర ప్లాంటుల్లో మాదిరి ఇతర అలవెన్సు చెల్లించాలని కోరుతూ పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హెచ్ఎంఎస్, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు సైతం అందించారు. హైదరాబాద్‌లో రీజినల్ లేబర్ కమిషనర్ నేతృత్వంలో పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టేందుకు కార్మికుల అభిప్రాయాలపై సోమవారం ఎస్టీపీపీ ప్రధాన గేటు ఎదుట రహస్యంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. ఎస్టీపీపీలోని ఆయా విభాగాల్లో 1400 మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా 1021 మంది సమ్మె చేయడానికే సిద్ధం అంటూ ఓటు ద్వారా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సారయ్య, సెక్రటరీ అనిల్‌రెడ్డి, ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి నవీన్, చారి సంతోష్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'గాలికుంటు' దరిచేరకుండా...

- పాడిపశువులకు వ్యాధుల నివారణ పథకం అమలు
- ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు
- ముందు జాగ్రత్త వహిస్తేనే పాడి పరిశ్రమ అభివృద్ధి

జిల్లాలో పశుసంపద వివరాలు

ఆవులు, ఎద్దులు	1.75 లక్షలు
నల్లజాతి గేదెలు	1.10 లక్షలు
గొర్రెలు	5.20 లక్షలు
మేకలు	1.80 లక్షలు
మొత్తం	9.85 లక్షలు


గేదెకు టీకా వేస్తున్న పశువైద్యుడు

మంచిర్యాలఅగ్రికల్చర్: పాడిరైతులు పశువులకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకా వేయించాలని పశువైద్యాధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు ఉచితంగా టీకాలు వేయనున్నారు. ఇండియాను గాలికుంటు వ్యాధి రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద దేశవ్యాప్తంగా ఏటా 6 నెలల వ్యవధిలో రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదటి విడత టీకాలు వేసిన పశువైద్యాధికారులు ఈ నెల 15 నుంచి రెండోవిడత ప్రారంభించారు. పశువులకు ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తేనే పాడిపరిశ్రమ అభివృద్ధి చెంది రైతుకు ఆర్థిక భరోసా లభించనుంది. ఈ క్రమంలో ప్రతీ పశువుకు టీకా వేసి చెవిపోగు వేస్తున్నారు. దాని నంబర్‌ను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

పశువుల్లో గాలికుంటు వ్యాధి అనేది ప్రమాదకరమైనది. ఈ వ్యాధి సూక్ష్మాతి, సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమిస్తుంది. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు ఎక్కువగా సోకుతుంది. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారం, వాయుకాలుష్యం, ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సంభవించిన పశువుల్లో మూతి, కాళ్లకు పుండ్లు పుడుతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. ఆకలి మందగించి నీరసంగా ఉంటుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వ్యవసాయ పనులకు ఉపయోగించే పశువులు నీరసించి మృత్యువాత పడుతాయి.

సద్వినియోగం చేసుకోవాలి



గాలికుంటు వ్యాధి సోకి పశువులు మృత్యువాత పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ప్రతీ ఆరునెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు ఉచితంగా టీకాలు వేస్తాం. పాడిపశువులు కలిగిన రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.– డాక్టర్ శంకర్, జిల్లా పశువైద్యాధికారి, మంచిర్యాల

వ్యాధి ప్రభావం..

ఈ వ్యాధి వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నా వ్యాధి సోకిన పశువులు నీరసంగా ఉండి శక్తి సామర్థ్యాలు కోల్పోతాయి. చికిత్సకు అయ్యే ఖర్చు కూడా చాల ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి మూలంగా పాలిచ్చే పశువుల్లో పాల నాణ్యత, మేకలు, గొర్రెల్లో మాంసం నాణ్యత గణనీయంగా తగ్గిపోతుంది. అంతే కాకుండా ఎగుమతులపై గణనీయమైన ప్రభావం పడుతుంది. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద దేశంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సంకల్పించింది.

పేకాట నిర్వాహకుడి అరెస్టు

కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లి గ్రామ శివారులో ఈనెల 2న పేకాట నిర్వహిస్తూ పట్టుబడిన తాండ్ర పోచంను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మార్చి 29న పేకాట నిర్వహిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, అయినా అతనిలో మార్పురాకపోవడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు.

నగదు బదిలీ చేయించుకున్న వ్యక్తిపై కేసు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై రాజేందర్

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుల నుంచి మైక్రో ఏటీఎంతో తన అకౌంట్‌లోకి నగదు బదిలీ చేయించుకున్నాడని ఈనెల 17న 'మైక్రో ఏటీఎంతో చేతివాటం' పేరిట 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. కొండంపేటకు చెందిన గావిడి భీమయ్య ఈ నెల 3న తన అకౌంట్‌లో ఉన్న రూ.6వేలు డ్రా చేయడానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లగా నక్కలపల్లికి చెందిన చల్ల సాయిరెడ్డి విత్‌డ్రా ఓచర్ రాయడంతో పాటు అతని అకౌంట్ నుంచి రూ.59వేలు తన ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. గమనించిన బాధితుడి కుమారుడు సతీశ్ కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 17 మంది బ్యాంక్ అకౌంట్‌ల నుంచి రూ.8,38,255లు తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అయినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు సాయిరెడ్డిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం బోయవాడకు చెందిన శంకర్ ఉద్యోగం ఇప్పించాలని, కాసిపేట మండలం మాలకెపల్లికి చెందిన ఆత్రం శంకర్ ల్యాప్‌టాప్ మంజూరు చేయించాలని, ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన గణేశ్ కిరాణా దుకాణం మంజూరు చేయించాలని, దేగాం మండలం దేవులగూడకు చెందిన సములాల్ పట్టా చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్ రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, తదితరులు పాల్గొన్నారు.

'గిరి' క్రీడారత్నాలకు సత్కారం


సత్కరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: ఇటీవల జరిగిన జాతీయస్థాయి ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా సత్కరించి క్రీడా దుస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన క్రీడా పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటడం గర్వకారణమన్నారు. సన్మానం పొందిన వారిలో సిడాం శంకర్, పెందూర్ హన్మంత్, యాదవ్‌రావ్, శివ, మెస్రం నిఖిల్, శివచరణ్, రాథోడ్ కార్తీక్, కోచ్ శివకృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో డీడీ వసంత్‌రావు, ఏసీఎంవో జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హెచ్ఎం ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలో మూలమలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన రాజేశ్వర్ తన భార్య మల్లవ్వతో కలిసి ద్విచక్ర వాహనంపై కడెం నుంచి ఖానాపూర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో మూలమలుపు వద్ద బస్సు వెనుక భాగం తగలడంతో కిందపడ్డారు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.